ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024 | 5



నేటి నుంచి అంతర్వేది ఉత్సవాలు

- పది రోజులపాటు వైభవంగా ఉత్సవాల పర్వం
- సర్వం సిద్ధంచేసిన అధికారులు
- వివిధ వాహన సేవలకు ఏర్పాట్లు

- 7లో

రాంరాం!


పర్వత


దొరబాబు


జ్యోతుల

- జిల్లాలో వైసీపీకి పూర్తిగా దూరమైపోయిన ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం ఎమ్మెల్యేలు
- వచ్చే ఎన్నికల్లో పోటీకి అధిష్ఠానం టిక్కెట్లు ఇవ్వకపోవడంతో అడ్రస్‌లు గల్లంతు
- పార్టీకి సంబంధించిన ఏ కార్యక్రమానికీ హాజరవకుండా దూరందూరం
- ఎమ్మెల్యేలుగా అడపాదడపా అధికారిక కార్యక్రమాలకే ముఖం చూపిస్తున్న వైనం
- పార్టీకి దూరంగా ఉంటూ ఇటు రాజీనామాలు చేయకుండా భవిష్యత్తు కోసం పావులు
- జనసేన లేదా బీజేపీ నుంచి పోటీకి పెండెం దొరబాబు ముమ్మర ప్రయత్నాలు
- జ్యోతుల చంటిబాబు, పర్వత ప్రసాద్‌లకు ఏ పార్టీలోనూ సీటు హామీ దొరకని వైనం
- అటు ఎమ్మెల్యేల దుస్థితి చూసి చల్లగా జారుకుంటున్న కేడర్, నేతలు
- తాజాగా ఎంపీ అభ్యర్థి సునీల్ సైతం ఎమ్మెల్యేలను వదిలేసి ఇన్చార్జులతో భేటీ

జిల్లాలో వైసీపీకి ముగ్గురు ఎమ్మెల్యేలు పూర్తిగా దూరమైపోయారు. ఇన్నాళ్లు వైసీపీ అంటే తాము.. తామంటే వైసీపీ అన్నట్టుగా చెలరేగిన ముగ్గురు ఎమ్మెల్యేలు ఇప్పుడు పూర్తిగా ఒంటరైపోయారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి అధిష్ఠానం టిక్కెట్లు ఇవ్వకపోవడంతో పూర్తిగా పార్టీని వదిలేశారు. గడచిన కొన్ని నెలలుగా పార్టీకి సంబంధించి ఏ కార్యక్రమాలకు కూడా ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట ఎమ్మెల్యేలు హాజరవడం లేదు. కేవలం ఎమ్మెల్యేల హోదాలో అడపాదడపా అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారు. అది కూడా ప్రస్తుత వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అభ్యంతరం చెప్పకపోతేనే. ఈ నేపథ్యంలో వీరు ముగ్గురు పార్టీని వీడినట్టేనని తేలిపోతోంది. అయితే అధికారికంగా రాజీనామా చేయకపోయినా పార్టీతో దాదాపు తెగదెంపులు చేసేసుకున్నట్టు అనుచరులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే దొరబాబు జనసేన లేదా బీజేపీ నుంచి ఇతర నియోజకవర్గాల నుంచి టిక్కెట్‌కు ప్రయత్నిస్తుండగా, ఎమ్మెల్యేలు జ్యోతుల, పర్వతకు వేరే ఏ పార్టీ నుంచి సీటు హామీ లభించక స్తబ్దతగా ఉండిపోయారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రత్తిపాడు, జగ్గంపేట, పిఠాపురం వైసీపీ ఎమ్మెల్యేలు పూర్తిగా పార్టీకి దూరమైపోయారు. వచ్చే ఎన్నికల్లో వీరిని బరిలోకి దించితే ఓడిపోతామే భయంతో వైసీపీ అధిష్ఠానం వీరికి టిక్కెట్లు చింపేసింది. రాబోయే ఎన్నికల్లో వీరి స్థానంలో కొత్త ఇన్‌చార్జులను నియమించింది. దీంతో ఈ ముగ్గురు ఎమ్మెల్యేల రాజకీయ భవిష్యత్తు శూన్యంగా మారింది. ఇంతకాలం నాలుగున్నరేళ్లుగా నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యేగా చక్రం తిప్పి, పార్టీకి తామే పెన్నిధిగా ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు పెత్తనం చేశారు. తీరా ఇప్పుడు టిక్కెట్ పోవడంతో నిస్సహాయులుగా మారిపోయారు. ఇంతకాలం అడుగులకు మడుగులొత్తిన అధికారులు, కేడర్ కూడా కనీసం పట్టించుకోకపోవడంతో అవమాన భారం ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు పూర్తిగా ఇప్పుడు పార్టీకి దూరమైపోయారు. సీటు కోల్పోయిన తర్వాత కొద్దిరోజులపాటు వీరంతా పార్టీ కార్యక్రమాలకు హాజరయ్యారు. కార్యకర్తలతో సమీక్షలు నిర్వహించారు. కానీ గత రెండు నెలలుగా పార్టీకి పూర్తిగా ముఖం చాటేసేశారు. పార్టీ కార్యక్రమానికి హాజరవడంగానీ, కార్యకర్తలను కలవడంగానీ చేయడం లేదు. అయితే అడపాదడపా ఎమ్మెల్యేల హోదాలో అధికారిక కార్యక్రమాలు, ఇతర శంకుస్థాపనలకు మాత్రమే హాజరవుతున్నారు. ఇది కూడా ఒక్క పిఠాపురంలో ఎమ్మెల్యే దొరబాబుకు అవకాశం దొరుకుతోంది. జగ్గంపేట, ప్రత్తిపాడులో అయితే ప్రస్తుత కొత్త ఇన్చార్జులైన మాజీ ఎమ్మెల్యేలు తోట నరసింహం, వరుపుల సుబ్బారావులు మాత్రం ఎమ్మెల్యేలను అసలు పిలవొద్దని అధికారులకు అనధికారిక ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో వీరిద్దరి పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ఒకరకంగా చెప్పాలంటే టిక్కెట్ కోల్పోయిన తర్వాత ముగ్గురు ఎమ్మెల్యేలు అవమానభారంతో నియోజకవర్గాలకు దూరంగా ఉంటున్నారు. అటు కొత్త ఇన్చార్జులతో వీరికున్న పాత విభేదాలు సైతం దూరంగా ఉండడానికి మరో కారణం. ఇదిలాఉంటే కొత్తగా వచ్చిన ఎంపీ అభ్యర్థి సునీల్ కూడా గడచిన రెండు రోజులుగా జగ్గంపేట, ప్రత్తిపాడులలో పర్యటించి పార్టీ ఇన్చార్జులతో భేటీ అయ్యారు. కానీ ఎమ్మెల్యేల ముఖం కూడా చూడలేదు. దీంతో ఈ ముగ్గురు ఎమ్మెల్యేలు పార్టీని వీడిపోయినట్టేనని కేడర్ నిర్ణయానికి వచ్చేశారు. ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగ్గా ముగ్గురు ఎమ్మెల్యేలు కేవలం హాజరు వేసుకుని వచ్చేశారు. పార్టీ నేతలతో ఎక్కడా పెద్దగా కలవలేదు. ఇదిలాఉంటే తమ టిక్కెట్లు చిరిగిపోవడంతో టిక్కెట్ ప్రయత్నాలు మొదలుపెట్టిన ముగ్గురు ఎమ్మెల్యేలు కొంతకాలంగా వెంట మిగిలిన కొద్దిపాటి నేతలు, కేడర్‌ను కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే వైసీపీ లేదా టీడీపీ, జనసేనలో ఏదొక పార్టీలో టిక్కెట్ వస్తుందంటూ నచ్చచెబుతూ వస్తున్నారు. కానీ టిక్కెట్ ఛాన్స్ లేదని తెలియడంతో ఇటీవల వీరంతా చల్లగా జారుకోవడం మొదలుపెట్టారు. కొందరు ప్రస్తుత ఇన్చార్జుల వద్దకు వాలిపోగా, మరికొందరు టీడీపీ, జనసేనలో చేరిపోయారు. ఈ పరిస్థితుల్లో నిన్నటి దాకా వైభవంగా సాగిన ఈ ఎమ్మెల్యేల ప్రస్థానం అగమ్యగోచరంగా మారిపోయింది. అయినా తమ రాజకీయ భవిష్యత్తు కోసం తమ ప్రయత్నాలు తాము చేస్తున్నారు.

ఏ దారీ దొరకట్లే..

పిఠాపురం తరఫున ఏ పార్టీ నుంచీ పోటీకి అవకాశం లేకపోవడంతో ఎమ్మెల్యే దొరబాబు వేరే నియోజకర్గం నుంచైనా బరిలోకి దిగడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం జనసేన లేదా బీజేపీ నుంచి సీటు కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో మకాం వేసి ఆ పార్టీలతో సంప్రదింపులు చేస్తున్నారు. గతంలో బీజేపీ ఎమ్మెల్యేగా నెగ్గిన దొరబాబు ఒకవేళ టిక్కెట్ లభిస్తే ఏ నియోజకవర్గం నుంచైనా సిద్ధం అని సంకేతాలు పంపుతున్నారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు టీడీపీలో అవకాశం లేకపోవడంతో ఇప్పటికే పవన్‌ను కలిశారు. కానీ అక్కడి నుంచి కూడా టిక్కెట్ హామీ లభించలేదు. ఈనేపథ్యంలో నియోజకవర్గాన్ని వదిలేసి పూర్తిగా హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. అయితే టిక్కెట్ రాకయినా ఆఖరి నిమిషంలో జనసేనలో చేరే అవకాశం ఉందని అనుచరులు చెబుతున్నారు. ఎమ్మెల్యే పర్వత రాజకీయ భవిష్యత్తు అయోమయంగా మారింది. ఏ పార్టీలోను అవకాశం ఇవ్వకపోవడంతో స్తబ్దుగా ఉండిపోయారు. తనకు టిక్కెట్ ఇవ్వకపోయినా పనితీరుతో వైసీపీ అధిష్ఠానాన్ని ఆకట్టుకుంటానని, చివరి నిమిషంలో అయినా టిక్కెట్ వస్తుందని తొలుత గంభీరంగా ప్రకటించిన పర్వత తర్వాత పూర్తిగా ఆశలు వదిలేసుకున్నారు.



సాగునీరు అందక పిఠాపురం మండలంలోని వెల్దుర్తిలో ఎండిపోతున్న వరి పంట

సాగునీటి వెతలు!

- శివారు ప్రాంతాలకు అందని నీరు
- ఎండుతున్న దాళ్వా వరి పంట
- కలవరపడుతున్న రైతులు
- ఆదుకోవాలంటూ వేడుకోలు

పిఠాపురం, ఫిబ్రవరి 15: దాళ్వాకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. శివారు ప్రాంతాలకు నీరు అందకపోవడంతో వరి పంట ఎండిపోయే పరిస్థితికి చేరుకుంటోంది. కొన్నిచోట్ల పొలాలు బీటలు వారుతున్నాయి. పంటకు కీలకమైన దశలో సాగునీరు సరిగా అందకపోతుండడంతో రైతులు కలవరానికి గురవుతున్నారు. ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలో సుమారు 90 వేల ఎకరాల్లో దాళ్వా వరి పంట సాగవుతోంది. ఏలేరు రిజర్వాయర్‌తోపాటు గోదావరిలో నీటి లభ్యత అంతంత మాత్రంగానే ఉన్నప్పటికీ ఎన్నికల వేళ దాళ్వా సాగుకు అనుమతి ఇవ్వకుండా రాజకీయంగా ఇబ్బంది ఏర్పడుతుందనే భావనతో ప్రభుత్వం కొన్ని ఏరియాలు మినహాయించి దాళ్వా సాగుకు అనుమతిచ్చింది. అప్పట్లోనే సాగునీటి సరఫరాపై అధికారులు అభ్యంతరం వ్యక్తంచేసినా వాటిని పట్టించుకోలేదు. డెడ్ స్టోరేజీని దాటి ఏలేరు రిజర్వాయర్‌లో నీటి వినియోగానికి ప్రభుత్వం ప్రత్యేకంగా అనుమతులు మంజూరు చేసింది. ప్రభుత్వం, వైసీపీ ప్రజాప్రతినిధులు భరోసా ఇవ్వడంతో ఏలేరు, పీబీసీ పరిధిలో రైతులు వరి నారుమడులు వేశారు. నాట్లు సమయంలోనే కొంతమేర సాగునీటి ఇబ్బంది ఏర్పడినా అధిగమించగలిగారు. గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో పలుచోట్ల వరి నారుమడులు ఎండిపోవడంతో కొందరు నాట్లు వేయకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేశారు.

కీలక దశలో..

ప్రస్తుతం దాళ్వా వరి చిరుపొట్ట దశలో ఉంది. ఆలస్యంగా వరినాట్లు వేసిన ప్రాంతాల్లో ఇంకా ఆ దశకు చేరుకోలేదు. ఇప్పుడు సాగునీరు లభ్యత వరి పంటకు అత్యంత కీలకం. ఇటువంటి తరుణంలో ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు పిఠాపురం నియోజకవర్గంలోని ప్రాంతాలకు చేరడం లేదు. శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంది. పిఠాపురం మండలం వెల్దుర్తి, పి.దొంతమూరు, పి.రాయవరం, రాపర్తి, భోగాపురం, బి.ప్రత్తిపాడు, పి.తిమ్మాపురం, అగ్రహారం, ఇల్లింద్రాడ తదితర గ్రామాలు, గొల్లప్రోలు మండలంలోని సీతానగరం, గొల్లప్రోలు, లక్ష్మీపురం, చెందుర్తి తదితర గ్రామాల్లో పలుచోట్ల వరిపంట ఎండిపోయే పరిస్థితికి చేరుకుంటోంది. వెల్దుర్తి తదితర ప్రాంతాల్లో పంటపొలాలు బీటలు వారుతున్నాయని రైతులు తెలిపారు. పంటలను కాపాడుకునేందుకు పలుచోట్ల ఇంజన్ల సహాయంతో నీరు తోడుకుంటున్నారు. పీబీసీ పరిధిలోని శివారు ప్రాంతాలకు సాగునీరు అందక పంటపొలాలు ఎండిపోతున్నట్టు రైతులు చెబుతున్నారు.

నీరు విడుదలవుతున్నా..

ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు పిఠాపురం నియోజకవర్గంలోని కాలువలకు సక్రమంగా చేరకపోవడంతోనే ప్రస్తుతం సాగునీటి సమస్య తలెత్తింది. తొలుత రిజర్వాయర్ నుంచి 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేవారు. అయితే శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదని రైతులు నుంచి ఫిర్యాదులు రావడంతో దీనిని 1100 క్యూసెక్కులకు పెంచారు. అయినప్పటికీ సాగునీరు అందని పరిస్థితి ఉంది. పిఠాపురం వంతు సమయంలో కూడా పూర్తిస్థాయిలో సాగునీరు రావడం లేదని రైతులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ అడ్డుకట్టలు వేసి సాగునీటిని మళ్లించుకుంటుండడంతో పిఠాపురం నియోజకవర్గంలోని వరి తదితర పంటలకు నీరు రావడం లేదని వారు చెబుతున్నారు. పలుచోట్ల కాలువల్లో పూడిక పూర్తిస్థాయిలో తొలగించకపోవడం ఒక కారణంగా భావిస్తున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను 1500 క్యూసెక్కులకు పెంచాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గ ప్రాంతానికి సాగునీరు అందించే సమయంలో ఎగువ ప్రాంతాల్లో కాపలా పెట్టి నీరు నేరుగా ఇక్కడి కాలువల వరకూ చేరేలా చూడాలని అధికారులకు పలువురు సూచిస్తున్నారు. సాగునీటి సరఫరా మెరుగుపడకుంటే పంటలు పూర్తిగా ఎండిపోయి పెట్టుబడులు కోల్పోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాగునీరందక తడారిపోయిన చేలు



కొండెవరంలో సాగునీరందక బీడు పట్టిన చేలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 15: దాళ్వా సీజన్లో సాగుచేసిన వరి చేలకు సాగు నీరందక బీటలువారుతున్నాయి. కొత్తపల్లి మండలంలో 10,152 ఎకరాల్లో రైతులు దాళ్వా సాగు చేశారు. ప్రస్తుతం పంట పొట్ట దశ, ఈనె దశలకు చేరుకొన్నాయి. రెండో పంట సాగు చేసిన రైతులంతా పూర్తిస్థాయిలో చేలకు పెట్టుబడి పెట్టారు. దాళ్వా సాగుచేసిన కొండెవరం, నవఖండ్రవాడ, యండపల్లి తదితర గ్రామాల్లో చేలకు సాగు నీరందకపోవడంతో బీటలువారి, కలుపు తెగ పెరిగిపోతోంది. ఇటీవలే చేలల్లో పూర్తిస్థాయిలో కలుపు తీయించారు. నీరు చేలల్లోకి చేరకపోవడంతో పొలాలు ఎండి కలుపు మొక్కలు మళ్లీ పెరిగిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. తక్షణం సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.



కాకినాడ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఏపీజేఏసీ సభ్యులు

ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన ఏపీ జేఏసీ ఉద్యోగులు

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 15: ఏపీజేఏసీ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు గురువారం కాకినాడ ఆర్డీవో కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ఉద్యోగులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ చైర్మన్ గుద్దడి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రతీ ఒక్క ఉద్యోగి ఆందోళనలో పాల్గొనాలని, డిమాండ్ల సాధన కోసం కలసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులకు రావాల్సిన ఎస్ఎల్, జీపీఎఫ్ లోన్స్, ఏపీ జీఎల్ఐ, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12 పీఆర్సీ 30 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, పాము శ్రీనివాస్, జడ్పీ సంఘం అధ్యక్షుడు ఆర్‌వీ రమేష్, టీచర్ సంఘాల నాయకుడు మోర్త శ్రీనివాస్, బి.మహేష్, యుటీఎఫ్ నుంచి నగేష్, ఏజీఎన్‌జీవో మట్టపర్తి వెంకటేశ్వరరావు, పాలపర్తి మూర్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ద్వారంపూడి పూజలో కూర్చుంటున్నారు..

దుకాణాలు మూసివేయండి!

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 15: సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి దంపతులు శుక్రవారం 16వ తేదీ నాలుగు గంటల నుంచి స్థానిక ఆర్ఎంసీ గ్రౌండ్‌లో నిర్వహించే శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొంటున్నారు. దీంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి సిటీలోని దుకాణాలన్నీ మూసివేయాలని కోరుతూ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్ పేరిట జారీచేసిన సర్క్యులర్‌పై వ్యాపారస్తులు, నిర్వాహకులు విస్మయం చెందారు. దుకాణాలు మూసేసి సిబ్బందితో వచ్చి కల్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించి, స్వామివారి కృపకు పాత్రులు కావాలని సర్క్యులర్‌లో పేర్కొనడం గమనార్హం. ఏ సీఎం వచ్చినా, పీఠాధిపతులు, మఠాధిపతులు వచ్చినా ఇలాంటి సర్క్యులర్ జారీ కాలేదని, ఇప్పుడు ఎమ్మెల్యే కార్యక్రమానికి దుకాణాలు మూసేయాలనడంపై విమర్శలు వస్తున్నాయి.

దరఖాస్తులోనూ దోపిడీ

- నిరుద్యోగుల నుంచి టెట్, డీఎస్సీ దరఖాస్తులకు ఫీజుల మోత
- ఆన్‌లైన్‌లో సర్వర్ కష్టాలు..ఫీజుల కోత
- ఐడీ రాక దరఖాస్తు చేసుకోలేని యువత.. సొమ్ములు పోతున్నాయంటూ అభ్యర్థుల ఆందోళన
- హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసినా స్పందించని వైనం
- 17న టెట్, 21న ముగియనున్న దరఖాస్తు ప్రక్రియ

పెద్దాపురం, ఫిబ్రవరి 15 : ఓ ప్రైవేటు పాఠశాలలో రూ.10 వేలకు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బీఈడీ అభ్యర్థి డీఎస్సీ దరఖాస్తు చేసుకోవడానికి ఇంటర్ నెట్ సెంటర్‌కు వెళ్లాడు. టెట్‌లో మార్కులు పెరగాలని మరోసారి రాసేందుకు దరఖాస్తు చేసుకోవాలని భావించాడు. ఒక్కో దరఖాస్తుకు రూ.750 ఫీజు. టెట్‌లో మూడు పేపర్లు, డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవడానికి ఫీజు రూ.3 వేలు అప్పుచేశాడు. బ్యాంకు ఖాతాలో వేసుకున్నాడు. దరఖాస్తు చేసుకుంటే బ్యాంకు ఖాతాల నుంచి మొత్తం సొమ్ములు కోత అయ్యాయి. కానీ వెబ్‌సైట్ పని చేయలేదు. అభ్యర్థి ఐడీ రాలేదు. ఐడీతోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అప్పుచేసిన సొమ్ములు పోయాయి. దరఖాస్తుకు నోచుకోలేదు. మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి సొమ్ములు ఎక్కడి నుంచి తేవాలంటూ అభ్యర్థి ఆందోళన చెందుతున్నాడు. దరఖాస్తు చేసుకున్న సొమ్ములు ప్రభుత్వ ఖాతాలో జమ అయిపోతున్నాయి. తీరా దరఖాస్తు చేసుకోలేక దిక్కులు చూసే పరిస్థితి నెలకొంది. సార్వత్రిక ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల భర్తీ అంటూ హడావుడి చేస్తోంది. వేలాది పోస్టులు ఖాళీగా ఉంటే కొద్దిపాటి పోస్టులు మంజూరు చేసింది. ఏటా డీఎస్సీ ఉంటుందని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిరుద్యోగ యువతకు మొండి చేయి చూపారు. చివరి ఏడాది కేవలం ఆరు వేల ఉపాధ్యాయ పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇదంతా ఎన్నికల స్టంట్‌గానే భావిస్తున్నారు. పోస్టుల సంఖ్యను పెంచాలంటే నిరుద్యోగ యువత ఆందోళన చేపట్టింది.

విడివిడిగా ఫీజులు..

ఉపాధ్యాయ పోస్టుల కోసం ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవాలంటే టెట్ అర్హత సాధించాలి. టెట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా డీఎస్సీలో వెయిటేజీ మార్కులు ఉంటాయి. గతంలో టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు ఇప్పుడు మరోసారి దరఖాస్తు చేసుకుంటున్నారు. ఉపాధ్యాయ పోస్టులు, టెట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తున్నారు. గతంలో దరఖాస్తుకు రూ.250 చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడది ఏకంగా రూ.750 వరకు పెంచేశారు. నిరుద్యోగులు ఇంత మొత్తంలో చెల్లించేందుకు ఇబ్బందులుపడుతున్నారు. మరోవైపు సొమ్ములు చెల్లించిన తరువాత ఓటీపీ వస్తోంది. అది భర్తీ చేసిన తరువాత అభ్యర్థి ఐడీ రాకుండానే అభ్యర్థుల బ్యాంకు ఖాతా నుంచి సొమ్ములు కోత అయిపోతున్నాయి. అభ్యర్థి ఐడీ వస్తేనే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది సర్వర్ సమస్యతో అభ్యర్థి ఐడీ రావడం లేదు. మరోవైపు సొమ్ములు కోల్పోయి అభ్యర్థులు గగ్గోలు పెడుతున్నారు. ఇలా జిల్లాలోనే చాలామంది అభ్యర్థులకు బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ములు డెబిట్ అయిపోయాయి. కానీ దరఖాస్తు చేసుకోలేకపోయారు. సర్వర్ సమస్య వల్ల వెబ్‌సైట్ సక్రమంగా పనిచేయడం లేదు. దీనికితోడు ఈనెల 17వ తేదీతో టెట్, అలాగే 21వ తేదీతో దరఖాస్తు ప్రక్రియ గడువు ముగుస్తుంది. డీఎస్సీ దరఖాస్తుదారులకు వయసు అప్‌డేట్‌లో సమస్యలు రావడంతో అభ్యర్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అభ్యర్థులు దరఖాస్తు ప్రక్రియ పూర్తికావడం లేదు. ఈ సమస్యలపై హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసినా స్పందన ఉండడం లేదని, నమోదుచేసిన వాటికి మీరే బాధ్యులు అని మాకు ఎటువంటి సంబంధం లేదని ప్రకటనలు వస్తున్నాయని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ విషయాలు బయటకు చెబితే ప్రభుత్వపరంగా ఇబ్బందులుపడతామన్న గుబులు వారిలో వెంటాడుతోంది. మొత్తానికి డీఎస్సీ ఇచ్చారన్న సంతోషం కన్నా కొద్దిపాటి పోస్టులకు ఫీజు దోపిడీ వీరిపై నీళ్లు చల్లుతోంది.



ఆన్‌లైన్ అప్లికేషన్ ఫారం

రూ. 500 కోట్ల ప్రజా ధనాన్ని దోచుకున్న ద్వారంపూడి

మాజీ ఎమ్మెల్యే కొండబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిటీ మాజీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 15: పన్నుల రూపంలో కాకినాడ కార్పొరేషన్‌కు ప్రజలు చెల్లిస్తున్న సుమారు రూ.500 కోట్లను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి దోచుకున్నారని, వీటిని కప్పిపుచ్చుకునేందుకు పూజలు నిర్వహిస్తున్నారని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆరోపించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాంబమూర్తినగర్‌లో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి టీటీడీ రూ.2 కోట్లు మంజూరు చేసిందని గతంలో ద్వారంపూడి చెప్పారని, ఇప్పుడు తన సొంత నిధులు రూ.4 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీఆర్ బాండ్ల పేరుతో రూ.250 కోట్లు కొట్టేశారని, గతంలో సురేష్‌నగర్‌లో ప్రభుత్వ భూమిపై టీడీఆర్ బాండ్ల రూపంలో రూ.160 కోట్లు యాజమానులను బెదిరించి దోచుకున్నారని ఆరోపించారు. హిందువుగా వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే. ముఖ్యమంత్రిగా మాత్రం క్రైస్తవుడు ఉండాలని కోరుకుంటున్నానని గతంలో ఓ సభలో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. స్వార్థ రాజకీయాలకోసం కులాలు, మతాలను వాడుకున్న హీన చరిత్ర ద్వారంపూడిదన్నారు. మఠాధిపతులు, పీఠాధిపతులు, చాగంటి కోటేశ్వరరావులాంటి ప్రముఖులు కాకినాడలో నిర్వహించిన ఏ కార్యక్రమాలకు దుకాణాలు మూసివేయాలని సర్క్యులర్ జారీచేసిన దాఖలాలు లేవని, ఎమ్మెల్యే దంపతులు పూజలో కూర్చుంటున్నారని, వ్యాపార దుకాణాలన్నీ మూసివేయాలని బెదిరించడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఈ సమావేశంలో మల్లిపూడి వీరు, ఎంపీ తాజుద్దీన్, ఒమ్మి బాలాజీ, తుమ్మలపల్లి రమేష్, గుజ్జు లక్ష్మణరావు పాల్గొన్నారు.

శరవేగంగా సాధారణ ఎన్నికల నిర్వహణ పనులు



ఈవీఎంలు అమర్చేందుకు సిద్ధంచేసిన రేక్‌ల నమూనా పరిశీలిస్తున్న కలెక్టర్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 15: జిల్లాలో సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణ కోసం శరవేగంగా పనులు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో ఈవీఎంలు అమర్చేందుకు తయారు చేసిన రేక్‌ల నమూనాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ పరిధిలో జరిగే ఎన్నికల నిర్వహణకు అవసరమైన రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్లను జేఎన్‌టీయూకేలో ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన సివిల్ పనులు, ఈవీఎం స్టోరేజ్ రేక్‌లు ఎంపికచేసి టెండర్ ద్వారా ఆర్డర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎలక్టోరల్ రోల్‌కు సంబంధించిన ప్రతీ వారం జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో ఈఆర్వోలు గుర్తింపుపొందిన పార్టీలతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఈవీఎం, వీవీ ప్యాడ్లు, స్టోరేజ్ చేసేందుకు రేక్‌ల కొలతలు, నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేసి సూచనలు చేశారు. ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం. హరిప్రసాద్‌బాబు, ఎన్నికల డీటీ ఎం జగన్నాథం పాల్గొన్నారు.

ఇంటింటికి కుళాయి కనెక్షన్లు సకాలంలో పూర్తిచేయాలి : కలెక్టర్ కృతికాశుక్లా

కార్పొరేషన్(కాకినాడ),ఫిబ్రవరి15: జిల్లాలో జలజీవన్ మిషన్ కింద చేపట్టిన ఇంటింటికి కుళాయి కనెక్షన్ పనులను సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్.. ఆర్‌డబ్ల్యూఎస్, జిల్లా పరిషత్, సమగ్రశిక్షా, డ్వామా, డీఆర్డీఏ శాఖల అధికారులతో కలిసి జల్‌జీవన్ మిషన్ పనులు, జగనన్న కాలనీలో తాగునీరు పైపులైన్ల పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఇంటికి కుళాయి కనెక్షన్ అందివ్వాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరే విధంగా జిల్లాలో చేపట్టిన పైపులైను సకాలంలో పూర్తిచేయాలన్నారు. జేజేఎం, జగనన్న కాలనీలో పైపులైను పనులు నిమిత్తం టెండర్ ద్వారా చేపట్టని 51 పనులను కమ్యూనిటీ కాంట్రాక్టు వ్యవస్థ ద్వారా గ్రామ జల సంఘాల కమిటీలు ఏర్పాటుచేసి పైపులైన్లు చేపట్టనున్నట్టు కలెక్టర్ తెలిపారు. 11 మంది సభ్యులు ఉన్న ఈ కమిటీ చేపట్టాల్సిన పనులపై జిల్లాస్థాయి కమిటీ ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. గ్రామ, మండల స్థాయిలో కమిటీలకు శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.శ్రీనివాసు, జడ్పీసీఈవో ఎ.శ్రీరామ చంద్రమూర్తి, డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ఏ ఎస్ఈ వెంకటరాజు, జడ్పీ ఏవో ఎం.బుజ్జిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్వేది ఉత్సవాలు

పది రోజుల పాటు వైభవంగా ఉత్సవాల పర్వం

సర్వం సిద్ధం చేసిన అధికారులు

వివిధ వాహన సేవలకు ఏర్పాట్లు



అంతర్వేది, ఫిబ్రవరి 15: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వార్షిక కల్యాణోత్సవాలు 16వ తేదీ శుక్రవారం రథసప్తమి పర్వదినాన ప్రారంభంకానున్నాయి. శుక్రవారం నుంచి పది రోజుల పాటు స్వామివారి కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అంతర్వేది చెరువులో హంసవాహనంపై స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

అంతర్వేదికి మార్గం:

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి అంతర్వేది చేరుకునే భక్తులు రావులపాలెం, రాజోలు మీదుగా రావాల్సి ఉంటుంది. పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చే భక్తులు పాలకొల్లు, దిండి-చించినాడ వంతెన మీదుగా శివకోడు, మలికిపురం మీదుగా రావచ్చు.

పెంచిన ఆర్టీసీ బస్సులు:

లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవాల సందర్భంగా ఆర్టీసీ అమలాపురం, రాజోలు, రాజమహేంద్రవరం, కాకినాడ, భీమవరం, పాలకొల్లు డిపోల నుంచి 120 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. అదే విధంగా గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అదనపు బస్సులను కల్యాణోత్సవాలకు సిద్ధం చేశామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

అంతర్వేది చేరుకోవాలంటే..

అంతర్వేదికి రాజోలు నుంచి 31 కిలోమీటర్లు, రాజమహేంద్రవరం నుంచి 104, అమలాపురం నుంచి 63, కాకినాడ నుంచి 118 కిలోమీటర్లు, పాలకొల్లు నుంచి 41 కిలోమీటర్లు, భీమవరం నుంచి 64 కిలోమీటర్లు.

నేటి వాహన సేవలు

కల్యాణోత్సవాల్లో తొలిరోజైన శుక్రవారం రథసప్తమినాడు స్వామివారికి సూర్యవాహనంపై ఊరేగింపు జరుగుతుంది. సూర్యుడు వెలుగునిచ్చే జ్ఞాన ప్రదాత. మనుషుల్లో అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానం అనే వెలుగును నింపేందుకు కోటి సూర్యప్రభా సమేతుడైన శ్రీలక్ష్మీనరసింహస్వామి సాయంత్రం 4.30గంటలకు సూర్య ప్రభా వాహనంపై గ్రామ మాడ వీధుల్లో ఊరేగుతారు. ముద్రికాలంకరణ అనంతరం స్వామివారు రాత్రి 8 గంటలకు చంద్ర ప్రభ వాహనంపై ఊరేగుతారు.



స్వామివారి రథం

నేడు స్వామివారు పెండ్లికొడుకాయనే

కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులు సంయుక్త నిర్వహణలో శుక్రవారం ఉదయం నుంచి అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తారు. బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులచే స్వామివారికి మధుపర్కములు సమర్పించి శుక్రవారం సాయంత్రం 6.30కు స్వామివారిని పెండ్లికుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెను చేస్తారు. లక్షల సంఖ్యలో భక్తులు విచ్చేస్తారని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

సునామీపై మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

యానాం, ఫిబ్రవరి 15: సునామీ వస్తే ప్రభుత్వ యంత్రాంగం ఎలా అప్రమత్తమవ్వాలి, ముంపు ప్రాంతాల ప్రజలను ఎలా రక్షించాలనే అంశంపై పుదుచ్చేరి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖ ఉత్తర్వులు మేరకు యానాంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. స్థానిక రాజీవ్‌నగర్, దరియాతిప్ప ఏటిగట్టు మార్గంలోని ఏవీఆర్ కెమికల్స్ పరిశ్రమ, రాజీవ్ రివర్ బీచ్, జెట్టి తదితర ప్రాంతాల్లో ఈ డ్రిల్ నిర్వహించారు. తొలుత అధికారులు సైరన్లు మోగించుకుంటూ సునామీ హెచ్చరికలు చేశారు. స్థానిక ఇందిరా గాంధీ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి రక్షణ చర్యలను పరిపాలనాధికారి మునిస్వామి, ఇతర శాఖల అధికారులు పర్యవేక్షించారు. పలు పాఠశాలలు, ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దారు దండాయుధపాణి, విద్యుత్ శాఖ ఏఈ లంక కృష్ణారావు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అన్నదాన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా రాజానగరానికి చెందిన మందవిల్లి వెంకటేశ్వరరావు-కాశీఅన్నపూర్ణ దంపతులు రూ.5,05,116 విరాళం సమర్పించారు. వారికి ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో బి.కిశోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, మన్యం భాను పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా గురువారం ఒక్కరోజు ఆదాయం రూ.1,63,990 లభించినట్టు ఈవో తెలిపారు.

భీమేశ్వరుని హుండీ ఆదాయం రూ.15.77 లక్షలు

ద్రాక్షారామ, ఫిబ్రవరి15: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారికి హుండీ ద్వారా రూ.15,77,588 ఆదాయం సమకూరింది. గురువారం స్వామివారి హుండీలను దేవదాయశాఖ తనిఖీదారు బాలాజీరామ్ ప్రసాద్ పర్యవేక్షణలో ఈవో పి.టి.వి సత్యనారాయణ, సిబ్బంది హుండీలను తెరిచి లెక్కించారు. 2023 డిసెంబరు 14 నుంచి గురువారం వరకు ఈ ఆదాయం లభించినట్లు ఈవో పి.టి.వి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో వాడ్రేవు సుందర రత్నాకరరావు, కంచర్ల చక్రి, సేవకులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి తాటిపర్తిలో నాటక పోటీలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 15: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో మార్కండేయ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 17వ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు జరగనున్నాయి. అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళా వేదికపై 16,17,18వ తేదీల్లో ఈ పోటీలను నిర్వహించనున్నారు. తొలి రోజు శుక్రవారం గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు అమృతహస్తం నాటికను, విజయవాడ కళానిలయం కళాకారులు బంధం నాటికను ప్రదర్శిస్తారు. 17వ తేదీన గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారులు ఇంద్రప్రస్థం, కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు కౌసల్యా సుప్రజ రామా, అమలాపురం రసవాహిన కళాకారులు స్వీకారం నాటికలను, 18వ తేదీన తాడేపల్లి అరవింద ఆర్ట్స్ కళాకారులు స్వర్గానికి వంతెన, కొప్పోలు పండు క్రియేషన్స్ కళాకారులు పక్కింటి మొగుడు నాటికలు ప్రదర్శించనున్నారు. కళాభిమానులు ఈ నాటికలను తిలకించేందుకు రావాలని మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి కోరారు.

20న జనార్ధనస్వామి రథోత్సవం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 15: పురాణ ప్రసిద్ధిగాంచిన జనార్ధన స్వామి రథోత్సవం, కల్యాణోత్సవాలను ఐదు రోజులపాటు నిర్వహించడానికి ఆలయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకూ నిర్వహించే రథోత్సవానికి ఆలయ ప్రాంగణాన్ని రంగులతో తీర్చిదిద్దుతున్నారు. మెట్ల మార్గం నుంచి రామపాదాల రేవు వరకు చలువ పందిళ్లు వేస్తున్నారు. రథసప్తమి సందర్భంగా రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తూర్పువైపునకు తిప్పి సిద్ధం చేస్తారు. రథోత్సవం సందర్భంగా పోలీస్‌స్టేషన్ సమీపంలోని ముఖ ద్వారాన్ని అగస్తేశ్వర ఆలయ చైర్మన్ పందెళ్ళ భానుప్రసాద్ ఆధ్వర్యంలో అందంగా తీర్చిదిద్ది ఆలయ పేర్లతో అలంకరించారు.

అనుమానం పెనుభూతమై..

భార్యను హతమార్చిన భర్త

ఆపై తానూ పురుగుమందు తాగి ఆత్మహత్య

రోడ్డున పడ్డ చిన్నారులు

కడియపుసావరంలో విషాదం

కడియం, ఫిబ్రవరి 15: భార్యపై అనుమానం.. ఓ కుటుంబాన్ని చిందర వందర చేసింది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను హతమార్చాడు.. ఆపై తానూ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. క్షణికావేశంలో జరిగిన ఈ ఘటనతో పిల్లలు అనాథలుగా మిగిలారు. కడియం మండలం కడియపుసావరం గ్రామంలోని వడ్డి వీరభద్రరావు కాలనీకి చెందిన దూళ్ళ సూరిబాబు(40)కు, అదే గ్రామానికి చెందిన సత్యశ్రీ(33)కి 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఎనిమిదో తరగతి చదువుతున్న కుమారుడు వెంకన్నబాబు, ఐదో తరగతి చదువుతున్న కుమార్తె వైష్ణవిశ్రీ ఉన్నారు. సూరిబాబు కౌలు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరు గతంలో వడ్డి వీరభద్రరావు కాలనీలో ఉండేవారు. ఇటీవల పంచాయతీ కార్యాలయం సమీపంలో సత్యశ్రీ తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉంటున్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న సూరిబాబు గురువారం ఉదయం భార్యతో గొడవపడి క్షణికావేశంలో పీకను పదునైన వస్తువుతో కోసాడు. దక్షిణ మండల డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, కడియం సీఐ బి.తులసీధర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సత్యశ్రీ మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. క్షణికావేశంలో చేసిన తప్పుకు మనస్తాపం చెందిన సూరిబాబు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలియడంతో బంధువులు, గ్రామస్థులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సూరిబాబు సాయంత్రం మృతి చెందాడు. భార్యాభర్తల మృతితో పిల్లలిద్దరూ అనాథలుగా మిగిలారు.



పోలీసులకు ఫిర్యాదు

ఈ ఘటనపై కొవ్వూరులో ఉంటున్న సత్యశ్రీ సోదరి సంతోషి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ తల్లిదండ్రులకు తాము ఐదుగురు సంతానమని, ఏడాది క్రితం తల్లి చనిపోయిందని తెలిపింది. ఈ ఏడాది సంక్రాంతి పండుగకు సత్యశ్రీ ఎవరితోనో ఫోనులో మాట్లాడుతున్నట్టు సూరిబాబు తమకు చెప్పాడని, దీంతో పెద్దల సమక్షంలో వారికి నచ్చచెప్పినట్టు చెప్పింది. సత్యశ్రీని బావ పలు మార్లు వేధించాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈనెల 14న సావరం గ్రామ పెద్దలు వచ్చి అక్కబావలకు సర్ది చెప్పారని తెలిపింది. ఈనెల 15వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో తమ పుట్టింటిలో అద్దెకు ఉండే వాళ్లు సమాచారం ఇవ్వడంతో వచ్చామని, అప్పటికే సత్యశ్రీ(33) రక్తపు మడుగులో ఉందని, పీకపై లోతుగా తెగిన గాయం ఉందని, మొక్కల గ్రాఫ్టింగ్‌కు వాడే బ్లేడ్‌తో దాడిచేసి ఉండొచ్చని సంతోషి ఫిర్యాదులో పేర్కొంది.



సూరిబాబు, సత్యశ్రీ కుటుంబం

చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు

నలుగురు బైక్ దొంగల అరెస్టు

17 వాహనాలు స్వాధీనం

రామచంద్రపురం, ఫిబ్రవరి 15: చెడు వ్యసనాలకు బానిసలై మోటారు సైకిళ్లను చాకచక్యంగా దొంగిలిస్తున్న నలుగురు బైక్ దొంగలను అరెస్టు చేసి వారి నుంచి 10 స్కూటీలు, 7 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ తెలిపారు. రామచంద్రపురం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో చర్చి కాం పౌండ్ వద్ద బైక్ దొంగతనం జరిగిందన్న ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న నలుగురిని అరెస్టు చేశామన్నారు. వారిని విచారించగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ప్రాంతాలలో అలాగే యానాం పరిధిలో 17 వాహనాలను దొంగిలించినట్లు తెలిపారన్నారు. అరెస్టైన వారిలో రామచంద్రపురం సాయినగర్‌కు చెందిన సలాది ఉదయ్ సాయి సుధీర్, పెమ్మిరెడ్డి బాలవెంకట్, కుమ్మర్లవీధికి చెందిన అమలదాసు నాగబాబు, మండపేట మండలం చిన్న ద్వారపూడి గ్రామానికి చెందిన కొప్పిశెట్టి దిలీప్ ఉన్నారన్నారు. చెడు వ్యసనాలకు బానిసలైన వారు సులువుగా డబ్బులు సంపాదించడానికి ఈ మార్గాన్ని ఎంచుకున్నారన్నారు. తాళం వేసి ఉన్న మోటారు బైక్ వైర్లను కలిపి స్టార్ట్ చేసి దొంగిలిస్తున్నట్లు నిందితులు తెలిపారని చెప్పారు. పట్టణంలో ఎవరైనా ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీసు స్టేషన్‌కు ముందస్తు సమాచారం అందజేస్తే వారి ఇళ్లకు భద్రత కల్పిస్తామని చెప్పారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ దొరరాజును, ఎస్ఐ కె.సురేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ కె.వీరబాబు, ఎస్.ఈశ్వర్‌రావు, కానిస్టేబుల్స్ టి. సూరిబాబు, ఇ.అనిల్ కుమార్, పోలయ్య, కె.లోవరాజును డీఎస్పీ రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం

వైసీపీ హయాంలో 150 మంది సర్పంచ్‌లు

ఆత్మహత్యలు చేసుకున్నారు

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్

గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్

అంబాజీపేట, ఫిబ్రవరి 15: దేశానికే పట్టుకొమ్ములుగా ఉన్న గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్ అన్నారు. టీడీపీ హయాంలో సర్పంచ్ చేసిన పనులకు నిధులు మంజూరు చేయకుండా అడ్డువేయడంతో పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారని చెప్పారు. మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజలకు అన్ని కష్టాలే అని అన్నారు. వలంటరీ వ్యవస్థను సీఎం జగన్ ఏర్పాటు చేసి పంచాయతీలను నిర్వీర్యం చేశారన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీఎస్టీ, బీసీ సర్పంచ్‌లు కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామాల అభివృద్ధికి అనేక నిధులు ఖర్చుచేశారని, వాటిని ఈ ప్రభుత్వం వచ్చాక మంజూరు చేయకుండా ఆ సర్పంచ్‌లను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. దీంతో రాష్ట్రంలో ఉన్న సుమారు 150 మందికి పైగా సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. సర్పంచ్‌ల హక్కుల సాధన కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభించేందుకు ఏపీ ఛాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో త్వరలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను జగన్ చిన్నాభిన్నం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు జమచేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను జగన్ ప్రభుత్వం దొంగలించిందని ఆరోపించారు. ఆర్థిక సంఘం నిధులు తిరిగి పంచాయతీలకు జమ చేసే విధంగా కోర్టును ఆశ్రయిస్తామన్నారు. రాష్ట్రంలో సుమారు 60 శాతం పైగా ఎస్సీఎస్టీ, బీసీ సర్పంచ్‌లు ఉన్నారని, వారిలో పొట్టకూటి కోసం కొందరు కూలి పనికి కూడా వెళుతున్నారన్నారు.సర్పంచ్‌లకు పంచాయతీల ద్వారా రూ.15 వేల నుంచి 20వేలకు పైగా గౌరవ వేతనం తీసుకునే విధంగా ప్రభుత్వం జీవో విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ సర్పంచ్‌ల చాంబర్ కార్యదర్శి జల్లి బాలరాజు, సర్పంచ్‌లు చిక్కం జంగమయ్య (పెదబాబు), పెద్దిరెడ్డి రాము, అడబాల తాతకాపు, కుంపట్ల ఆదిలక్ష్మి నాయకులు కొప్పిసీడి ఈశ్వరరావు ఉన్నారు.



నరేందర్‌కి జ్ఞాపికను అందిస్తున్న సర్పంచ్‌లు

తిరుమల విద్యాసంస్థల నూతన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తిరుమలరావు

తుని రూరల్, ఫిబ్రవరి 15: తిరుమల విద్యా సంస్థలు రాజమహేంద్రవరం వారి నూతన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసును గురువారం పాయకరావుపేట మెయిన్ రోడ్డులో గల డీసీసీ బ్యాంక్‌పై తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విలువలతో కూడిన విద్యను అందరికీ అందించాలనే సదుద్దేశ్యంతో తిరుమల విద్యాసంస్థను నెలకొల్పామన్నారు. పాయకరావుపేట, తుని చుట్టుపక్కల గల పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు కోరిన మేరకు పాయకరావుపేట పీఎల్‌పురం సెంటర్ హైవే పక్కన తమ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ క్యాంపస్ ఎల్‌కేజీ నుంచి తొమ్మిదో తరగతి, జూనియర్ ఇంటర్ డే స్కాలర్‌గా ప్రారంభించామన్నారు. పాయకరావుపేట, తుని, అన్నవరం చుట్టుపక్కల గ్రామాలకు బస్సు సౌకర్యం ఉందని, అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని చెప్పారు. అడ్మిషన్లు, ఇతర వివరాలు కోసం 80084 78777, 85209 26777 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకాడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ యు.శ్రీహరి, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇంటర్ విద్యార్థి దుర్మరణం



మండపేట, ఫిబ్రవరి 15: మండపేట తాపేశ్వరం కెనాల్ రోడ్డులో గురువారం మధ్యాహ్నం లారీ బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇంటర్ విద్యార్థి మృతిచెందాడు. పట్టణ అదనపు ఎస్ఐ నాంచారయ్య తెలిపిన వివరాలు ప్రకారం.. కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన పడాల అఖిల్ మణికంఠ ఆదిత్య కళాశాలలో జూనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం కాలేజీ నుంచి మండపేట తాపేశ్వరం వైపు బైక్‌పై వెళ్తుండగా తాపేశ్వరం నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో అఖిల్ అక్కడికక్కడే చనిపోయాడు. రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, అర్బన్, రూరల్ సీఐలు అఖిల్‌జమా, శ్రీధర్‌కుమార్‌తో పాటు పట్టణ ఎస్ఐ హరికోటి సంఘటనా స్థలానికి పరిశీలించారు. ఇంటి నుంచి కళాశాలకు వెళ్లిన అఖిల్ ప్రమాదవశాత్తు మరణించటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అఖిల్ మరణంతో సహచర విద్యార్థులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పట్టణ అదనపు ఎస్ఐ నాంచారయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో చుక్కల జింక మృతి

రాజవొమ్మంగి ఫిబ్రవరి 15: రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేట గ్రామ శివారు అటవీ ప్రాంతం నుంచి కుక్కల దాడి కారణంగా జనవాసంలోకి వచ్చిన చుక్కల జింక గురువారం మృతి చెందింది. బుధవారం గాయాలతో చుక్కల జింక అప్పలరాజుపేట గ్రామంలోకి రావడం గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారుల ఆధీనంలో ఉన్న చుక్కల జింక గురువారం మృతి చెందడంతో అటవీ శాఖ సబ్ డీఎఫ్‌వో శ్రీరామరావు ఆధ్వర్యంలో అటవీశాఖ కార్యాలయం సమీపంలో చుక్కల జింకకు పోస్టు మార్టం నిర్వహించి దహనం చేశారు.

ఎన్నికల విధులకు సన్నద్ధం కావాలి

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు అన్ని విధాలా సన్నద్ధం కావాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి అందరూ సమష్టిగా పూర్తి సమన్వయంతో పని చేయాలని.. సర్వీసులో రిమార్కు లేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా పోలీసు కార్యాలయం (డీపీవో)లో గురువారం ఆయన వార్షిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. వివిధ విభాగాల వార్షిక పనితీరు, జిల్లాలోని పరిస్థితులను ఆయనకు ఎస్పీ జగదీశ్ వివరించారు. అనంతరం డీపీవో ప్రాంగణంలో ఉన్న ఆయుధాగారం, డాగ్ స్క్వాడ్, బీడీ టీం, ఎంటీవో, ఆర్ఐ స్టోర్స్‌ని డీఐజీ సందర్శించారు. మినిస్టీరియల్, డీసీఆర్బీ, డీటీఆర్బీ, ఎస్‌బీ తదితర విభాగాలు సమర్పించిన వార్షిక పనితీరు నివేదికలను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్‌లోని సీసీ కెమెరాల లైవ్ స్ట్రీమింగ్‌ని వీక్షించారు. ఎన్నికల దృష్ట్యా డీపీవో నుంచి సకాలంలో ఎన్నికలకు సంబంధించిన సమాచారం రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయానికి, ఉన్నతాధికారులకు చేరే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆ మేరకు పోలీస్‌స్టేషను స్థాయి నుంచి సమాచార సేకరణ, క్రోడీకరణపై సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగిన సమయంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీడ్రిల్, వెపన్ డ్రిల్, మాబ్ డ్రిల్‌ని సాధన చేయాలన్నారు. మద్యం, గంజాయి, సారా అక్రమ రవాణా నియంత్రించాలన్నారు. సిబ్బందికి జిల్లా స్థాయిలో పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తొలుతగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ చెంచిరెడ్డి ఆధ్వర్యంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పరేడ్ కమాండర్‌గా సాయుధ రిజర్వు పోలీసు సిబ్బంది చేసిన కవాతును డీఐజీ వీక్షించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) పి.అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క అందిస్తున్న ఎస్పీ జగదీశ్

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికే భరోసా యాత్ర

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15: రేషన్ డీలర్స్ సమస్యల పరిష్కారానికే భరోసా యాత్ర చేస్తున్నామని రేషన్ డీలర్స్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు అన్నారు. భరోసా యాత్ర రాజమహేంద్రవరం చేరుకున్న సందర్భంగా హోటల్ జగదీశ్వరిలో గురువారం సాయంత్రం జరిగిన రేషన్ డీలర్స్ సమావేశంలో మాట్లాడారు. ఆహార భద్రత చట్టం పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం నిబంధనలను అనుసరించి రేషన్ డీలర్స్ ద్వారా మాత్రమే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని, తెలంగాణ మాదిరి డీలర్స్‌కి గౌరవ వేతనం కల్పించాలన్నారు.రేషన్ డీలర్స్, ఎండీయూ ఆపరేటర్లకు చెల్లించాల్సిన బకాయిలు ఈనెల 25వ తేదీలోపు చెల్లించాలన్నారు. రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జామి కృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా బి.నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేవీవీ రమణ, ఉపాధ్యక్షులుగా మంగం రామారావు (పెరవలి), వెంకటేశ్వరరావు (ఉండ్రాజవరం), ప్రధాన కార్యదర్శిగా వై.వెంకటరత్నం, కార్యదర్శిగా కె.కామేశ్వరరావు (కడియం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా రంగా (నిడదవోలు)ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా రమణ, రాష్ట్ర కోశాధికారి రాజులపాటి గంగాధర్ గౌడ్, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జామి కృష్ణ, పల్లయ్య, గొర్రెల సత్తిబాబు, అన్ని మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

నేడు భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, ఫిబ్రవరి 15: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో మాఘమాసం రథసప్తమి మహా పర్వదినం సందర్భంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. సూర్యనారాయణ స్వామి ఉపాలయం వద్ద విశేష అభిషేకపూజలు, విశేష పుష్పార్చన పూజలు నిర్వహించనున్నందున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఈవో నాగమల్లేశ్వరరావు కోరారు.

ఐదేళ్లలోపు చిన్నారులకు విధిగా పోలియో చుక్కలు

డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 15: ఐదేళ్లలోపు చిన్నారులకు విధిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజానికి కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ కోరారు. గురువారం స్మార్ట్‌సిటీ సమావేశ మందిరంలో మెడికల్ ఆఫీసర్లు, పారా మెడికల్ సిబ్బందికి మార్చి 3 వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సిన బాధ్యత సచివాలయం ఏఎన్‌ఎంలేదన్నారు. జిల్లాలో 1.88 లక్షల మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారని డీఐవో డాక్టర్ రత్నకుమార్ తెలిపారు. ప్రతీ 250 పిల్లలకు ఒక బూత్ చొప్పున 1336 బూత్‌లు ఏర్పాటు చేయడంతోపాటూ 2676 టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. వ్యాక్సిన్ వయల్ మోనిటర్, టాలీ షీట్లు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు.

'విద్యా ప్రమాణాల పెంపునకు కృషి'

తొండంగి, ఫిబ్రవరి 15: ఉన్నత పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు ఆరవ తరగతి నుంచే ప్రణాళికా బద్ధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం ఆయన కొత్తపెరుమాళ్ళపురం ఉన్నత పాఠశాలను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. దిగువ తరగతులలో తెలుగు,ఆంగ్లంలో చదవడం రాయడం, గణితంలో చతుర్విత ప్రక్రియలు వచ్చిన వారి సంఖ్య తక్కువగా ఉండడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం పదవతరగతి పైనే దృష్టి కేంద్రీకరించకుండా ఆరోతరగతి నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పదో తరగతిపై సబ్జెక్టుల వారీగా సమీక్ష నిర్వహించారు. నాడు- నేడు పనులను పరిశీలించారు. ఎంఈవో షేక్ బాబ్జి, ప్రధానోపాధ్యాయులు సీహెచ్.సత్యన్నారాయణ, సీఆర్పీ మీరాసాహెబ్ పాల్గొన్నారు.

'రైతులు అప్రమత్తంగా ఉండాలి'

పెద్దాపురం, ఫిబ్రవరి 15: వరిలో ఆశించే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక కేంద్రం కోఆర్డీనేటర్ చల్లా వెంకటనరసింహారావు అన్నారు. మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో వరి పంటలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో సుమారు 65 వేల హెక్టార్లలో వరి సాగును రైతులు చేస్తున్నారని, అక్కడక్కడ కాండం తొలిచే పురుగు ఆశించిందని, ఎండాకు తెగులు సోకడం చాలా తక్కువన్నారు. రైతులు ఈవిషయంలో జాగ్రత్తలు వహించాలన్నారు. వ్యవసాయాధికారులు సూచించిన విధంగా సస్యరక్షణ చర్యలను చేపట్టాలని, సమగ్ర సస్యరక్షణ చర్యలతోనే తెగుళ్లను నివారించవచ్చన్నారు.

'వైసీపీ ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధం'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 15: కరెంటు బిల్లులు పెంచిన వైసీపీ ప్రభుత్వంపై యుద్ధానికి సిద్ధమని జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు, సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ అన్నారు. గురువారం సిటీ సహాయ కార్యదర్శి వాడ్రేవు లోవరాజు ఆధ్వర్యంలో డైరీ ఫారం జంక్షన్ ప్రాంతంలో పల్లంరాజునగర్‌లో పర్యటించారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ, అట్ల సత్యనారాయణ, బడే కృష్ణ, అడబాల సత్యనారాయణ, శ్రీమన్నారాయణ, ఆకుల శ్రీనివాస్, సుంకర సురేష్, మండపాక దుర్గాప్రసాద్, పెద్దిరెడ్డి ఉదయభాస్కర్, కంటా రవిశంకర్, ముత్యాల దుర్గాప్రసాద్ ఉన్నారు.

'రూ.29కే కిలో భారత్ రైస్'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 15: బియ్యం ధరల నియంత్రణ కోసం ప్రధాని మోదీ భారత్ రైస్ కిలో బియ్యం రూ.29లకే విక్రయించే పథకాన్ని అమలు చేస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి కాళ్ల ధనరాజు తెలిపారు. గురువారం పండూరులో పార్టీ అసెంబ్లీ కోకన్వీనర్ ఘంటసాల గోవిందరాజుతో కలసి మన సంకల్పం వికసిత భారత్ కార్యక్రమంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వికసిత్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పైడా రవీంద్ర, శ్రీనివాసరావు, చోడిశెట్టి రమేష్ బాబు, కేవీసీ అప్పాజీ, తుమ్మలపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతుల నవీన్ ప్రచారం

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 15: మండలంలోని సీతారాంపురంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. జగన్ ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, మళ్లీ రామరాజ్యం రావాలంటే చంద్రన్న రావాలని అన్నారు. నవీన్ సమక్షంలో గల్లా కూనిశెట్టి, జువ్వల, మట్ల, తదితర కుటుంబాలు టీడీపీలో చేరారు. మారిశెట్టి భద్రం, పైడిపల సూరిబాబు, గళ్ళ శ్రీను, రేఖ బులిరాజు, గుడివాడ సత్తిబాబు, గల్లా ఈశ్వరరావు, అడపా తాతాజీ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

కరప, ఫిబ్రవరి 15: నడకుదురు, గురజనాపల్లిల్లో గురువారం లబ్ధిదారులకు ఇంటి పట్టాలను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అందజేశారు. గురజనాపల్లిలో రూ.65లక్షలతో నిర్మించిన సీసీ, బీటీ రోడ్లను ప్రారంభించారు. ఆర్డీవో ఇట్ల కిషోర్, తహశీల్దార్ రామకోటేశ్వరరావు, సర్పంచ్‌లు దేగల లలితకుమారి, అనుసూరి శ్రీనివాస్, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీటీసీలు పైలా రామతులసి గోవింద్, యండమూరి వీరవేణి, కరప ఏఎంసీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, పబ్బినీడి పాపారావు, రొక్కాల గణేష్, రెడ్డిపల్లి రమేష్, ఆర్ఐ పి.మాచరరావు ఉన్నారు.

ప్రత్తిపాడు: ఏలేశ్వరం మండలం జె.అన్నవరం గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 161మందికి 50 సెంట్లు చొప్పున 83 ఎకరాల భూమిని గురువారం పంపిణీ చేశారు. ఈ జిరాయితీ భూమికి శాశ్వత పట్టాలను మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, వీరంశెట్టి, ఎంపీటీసీ కలారి సత్తిబాబు, కొండపల్లి వెంకటేష్, అగ్రవరం సర్పంచ్ కూనపు రెడ్డి సుబ్బారావు, తిరుమాలి సర్పంచ్ సూది వీరప్రసాద్ తదితరులున్నారు.

ప్రత్తిపాడులో 'ఇంటింటా కాంగ్రెస్'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 15: ప్రత్తిపాడులో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గురువారం ఉమ్మిడి వెంకట్రావు ఇంటింటా కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. పీసీసీ సభ్యుడు దర్నాల కోట శ్రీనుతో కలిసి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆదరించాలని ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేసేందుకు ప్రజలు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇనుమల రాజ, దిడ్డి రాజు, దొంతం శెట్టి చంద్రశేఖర్, గుర్రం విష్ణు, కంది మళ్ళ శామ్యూల్, దాసరి సత్తిబాబు, చక్రం, పి.పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో శానిటేషన్ వర్కర్ల ఆందోళన

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 15: సమస్యలు పరిష్కరించాలంటూ గత 14వ రోజులుగా కాకినాడ జీజీహెచ్‌లో శానిటేషన్ వర్కర్లు నిర్వహిస్తున్న ఆందోళన గురువారానికి 14 రోజులకు చేరింది. యూనియన్ అధ్యక్షులు సీహెచ్ విజయ్‌కుమార్, బి మంగతాయారు మాట్లాడుతూ తమ డిమాండ్ల పరిష్కారం కోసం కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో రెండుసార్లు చర్చలు జరిగినా పరిష్కారం కాలేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము తమ జీతాల నుంచి కోత కోయడం ఎంత వరకు సమంజసమన్నారు.

చొల్లంగిలో కొనసాగిన నిరసన దీక్ష

తాళ్లరేవు, ఫిబ్రవరి 15: చొల్లంగిలోనే స్థానికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని స్థానికులు చేస్తున్న నిరసన చేస్తున్న దీక్ష గురువారం 16 రోజులకు చేరుకుంది. చొల్లంగిలో వైసీపీ నేతల ఓట్ల కోసం లబ్ధిదారుల వద్దకు ఏమోహం వేసుకుని వస్తారో చూస్తామని లబ్ధిదారురాలు అల్లం లక్ష్మి అన్నారు. మాకు పట్టాలివ్వాలని నిరసన చేస్తుంటే అధికార పార్టీ నేతలు, కార్యకర్తలకు పట్టనట్లు వ్యవహరించడం చాలా బాధాకరమని అన్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్ర్కీన్స్: ఈగల్, ఊరు పేరు భైరవకోన, మేడమ్‌వెబ్, గుంటూరుకారం, ట్రూలవర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్ర్కీన్స్: ఈగల్, యాత్ర 2, ఊరు పేరు భైరవకోన, గుంటూరుకారం

తిరుమల	:	సూర్యుసన్ఆఫ్‌కృష్ణన్, ఓయ్
లక్ష్మి	:	ఈగల్
సీ అండ్‌సీ1	:	ఈగల్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	అంబాజీ మ్యారేజ్‌బ్యాండు
పద్మప్రియ	:	ఊరు పేరు భైరవకోన
సత్యగౌరి	:	ఊరు పేరు భైరవకోన
సూర్య 1	:	ఈగల్
సూర్య 2	:	ఊరు పేరు భైరవకోన

విద్యాసంస్థల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు

జగ్గంపేట, ఫిబ్రవరి 15: విద్యాహక్కు చట్టం కింద 2024-25 విద్యా సంవత్సరంలో అన్ని ప్రైవేటు, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల కోసం అనాథలు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పిల్లలు దరఖాస్తులు చేసుకోవచ్చని జగ్గంపేట ఎంఈవో నాయక్ తెలిపారు. ఆధార్‌కార్డు, ప్రాథమిక వివరాలతో హెచ్‌టీటీపీ:// సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా ఈనెల 23 నుంచి రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు సిద్ధం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



కిర్లంపూడి: టీడీపీలో చేరినవారితో నెహ్రూ



ప్రత్తిపాడు: టీడీపీలో చేరినవారితో సత్యప్రభ

కిర్లంపూడి, ఫిబ్రవరి 15: జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం మండలంలోని వేలంక గ్రామంలో వైసీపీ నుంచి సుమారు 76 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. మండల తెలుగు యువత అధ్యక్షులు గండే కాశీ ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన సొసైటీ త్రీమెన్ కమిటీ సభ్యులు గండే గోపి, గ్రామ పంచాయతీ 11వ వార్డు సభ్యులు గుర్తుర్తి శ్రీను, ఒంటెపల్లి బాబ్జి, కేదులూరి లచ్చయ్య, సూరి, గుర్తుర్తి యశోధకృష్ణ, దేవర కాటన్, ధూలి అప్పన్న, యడల నాగరాజు, గండికోట రాంబాబు తదితరులు వైసీపీకి రాజీనామా చేసి నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరగా పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ టీడీపీలోకి చేరుతున్నవారందరూ టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం విజయం సాధించడానికి కృషి చేయాలన్నారు. వేలంకకి సమృద్ధిగా సాగు నీరందించేందుకు, కాలువ తీసుకొస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌పీఎస్ అప్పలరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, క్లస్టర్ ఇన్‌చార్జి కుర్ల చినబాబు, టీడీపీ నాయకులు తూము కుమార్, గొడే బాల, కంచుమర్తి రాఘవ, బొజ్జపు శ్రీను, దాపర్తి సీతారామయ్య, సుంకవిల్లి రాజు, గ్రామ సర్పంచ్ రాయుడు స్వామి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఇంటి చల్లారావు, గండే కామేశ్వరరావు, చల్లారావు, బేతాళ నారాయణ మూర్తి, కుంచే శ్రీరామకొండలరావు, ఇంటి తమ్మాజీ, గండే రామలక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చినశంకర్లపూడిలో...

ప్రత్తిపాడు: చినశంకర్లపూడిలో 50 కుటుంబాలు వైసీపీకి నుంచి టీడీపీలోకి చేరాయి. మాజీ ఎంపీటీసీ మిరియాల శ్రీను ఆధ్వర్యంలో పిడుగు చిట్టిబాబు, బుర్రే గంగరాజు, మురేళ్ళ పద్మరాజు, బడ్డేటి వెంకటేష్, జంగంపల్లికన్నారావు, తంగెళ్ళ అప్పారావు, బుర్నే చంటిబాబు, బుర్నే అబ్బన్న, పులవపూడి రాజులు, గొల్లపూడి బాబ్జి టీడీపీలో చేరగా నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ ఆహ్వానించారు. కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, ఏక గంగ, ఏలూరి సర్పంచ్ రొంగల సత్యనారాయణ, కర్రి దుర్గ ఉన్నారు.

పోలింగ్‌బూత్‌ల్లో సదుపాయాల కల్పనకు చర్యలు : జేసీ



పిఠాపురంలో పరిశీలన చేస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

పిఠాపురం, ఫిబ్రవరి 15: ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా పోలింగ్ బూత్‌ల్లో అన్ని సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, పాతబస్టాండు వద్ద గల మున్సిపల్ ఉన్నత పాఠశాల తదితర ప్రాంతాల్లోని పోలింగ్‌బూత్‌లను ఆయన పరిశీలించి సదుపాయాలపై ఆరా తీశా రు. ప్రత్యేక అవసరాల గల ఓటర్లు, వృద్ధులు, మహిళలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. స్ట్రాంగ్‌రూమ్‌ల ఏర్పాటు, భద్రత కల్పన తదితర అంశాలపై పరిశీలన చేశారు. కాగా జగ్గయ్యచెరువు కాలనీకి చెందిన మహిళలు జేసీని కలిసి తమ ప్రాంతంలో రోడ్లు, డ్రెయిన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహశీల్దారు లక్ష్మీ ఉన్నారు.

పదవి నుంచి తొలగించేందుకు కుట్ర



నిరాహార దీక్ష చేస్తున్న సర్పంచ్ రజనీవాణి దంపతులు

పిఠాపురం రూరల్, ఫిబ్రవరి 15: తనకు సంబధం లేకుండా పంచాయతీ నిధులు దుర్వినియోగం చేసి తనను పదవి నుంచి తొలగించేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ప్రోద్బలంతో పంచాయతీ కార్యదర్శి ప్రయత్నిస్తున్నారని పిఠాపురం మండలం నవఖండ్రవాడకు చెందిన దళిత సర్పంచ్ బళ్ల రజనీవాణి ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సర్పంచ్ దంపతులు గురువారం నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. సర్పంచ్ అయిన తనకు పంచాయతీ సమావేశాలు అజెండా ఇవ్వకుండా కార్యదర్శి సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేస్తున్నారని తెలిపారు. సంతకాలు సైతం ఫోర్జరీ చేస్తున్నారని చెప్పారు. కార్యదర్శి చెప్పిన చోట తాను సంతకాలు చేయలేదని, ఏదొక విధంగా తనను సర్పంచ్ పదవి నుంచి తొలగించాలని ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు ఒత్తిడితో కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసి తక్షణం అతడిపై కేసులు నమోదు చేయాలని సర్పంచ్ డిమాండ్ చేశారు.

కొమరగిరిలో 'బాబు ష్యూరిటీ'



కరపత్రాలను పంపిణీ చేస్తున్న వర్మ

కొమరగిరి (కొత్తపల్లి), ఫిబ్రవరి 15: కొమరగిరిలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో గురువారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వంలో అమలయ్యే సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే పురుషోత్తమపట్నం పథకం తిరిగి ప్రారంభిస్తామన్నారు. ఎస్ఈజెడ్‌లో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. అనిశెట్టి సత్యానందరెడ్డి, కఠారి రాజబాబు, బత్తుల చైతన్యరాజేష్‌కుమార్, రాయుడు శ్రీరాములు, కఠారి పరమేశ్వరరావు, కఠారి దొరబాబు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 15: కాకినాడలో ఆంధ్ర కొప్పుల వెలమ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ని సానా ఫౌండేషన్ చైర్మన్ సానా సతీష్‌బాబు ఆవిష్కరించారు. సంఘ సభ్యులకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. సంఘం జాతీయ కన్వీనర్ రావు సంబంగి, యాసరపు కన్నబాబు, పోతుల రవి, పి. నాగమహేశ్వరి, గోగాడ నాయుడు, ఎనానాయుడు, ఆదిరెడ్డి బాబ్జీ, అంకంరెడ్డి రామానాయుడు ఉన్నారు

బాల్య వివాహాలతో అనేక అనర్థాలు

జిల్లా బాలల పరిరక్షణ అధికారి



పిఠాపురంలో అవగాహన సదస్సు దృశ్యం

పిఠాపురం, ఫిబ్రవరి 15: బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్.వెంకట్రావు తెలిపారు. పిఠాపురంలోని స్త్రీశక్తి భవనంలో గురువారం బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల ఆడపిల్లలు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుందని చెప్పారు. శారీరకంగా సన్నద్ధత లేకపోవడం వల్ల పుట్టబోయే బిడ్డకు, తల్లికి కూడా ప్రాణాపాయం ఉండే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో పిఠాపురం సీడీపీవో సీహారిక, డీఆర్డీఏ ప్రియదరిని, జిల్లా పరిరక్షణ విభాగం నుంచి విజయ, సోషల్ వర్కర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'బాల్య వివాహాలు నేరం'

కిర్లంపూడి, ఫిబ్రవరి 15: బాల్య వివాహాలు చట్టరీత్య నేరమని, అలా చేసిన వారికి రూ.1 లక్ష జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష ఉంటుందని జగ్గంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎం.పూర్ణిమ తెలిపారు. కిర్లంపూడి వెలుగు కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలన చట్టంపై గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఏపీఎం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పూర్ణిమ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098కు ఫోన్ చేయాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎం ఇనకోటి శ్రీనివాస్, చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ ఆర్.రవికుమార్, ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్ వైజర్ జి.సునీత, ఎస్. కరీం మున్నీసా, పి.బూతమ్మ పాల్గొన్నారు.

కాలుష్య పరిశ్రమలతో మనుగడకు ముప్పు



నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

ఒంటిమామిడిలో మత్స్యకారుల నిరసన

తొండంగి, ఫిబ్రవరి 15: మండలంలో ఏర్పాటవుతున్న కాలుష్య కారక డ్రగ్ పరిశ్రమల వల్ల మత్స్యకారుల మనుగడకు ముప్పు ఏర్పడుతున్నందున ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు నిరసన తెలిపారు. గురువారం ఒంటిమామిడిలో టీడీపీ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు కోడ వెంకట రమణ, టీడీపీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు, మాజీ జడ్పీటీసీ చొక్కా కాశీశ్వర్రావు తదితరులు నిరసన చేపట్టారు. రేషన్ కార్డు ఉన్న ప్రతీ మత్స్యకారుడికి నెలకు రూ.15 వేల ఆర్థిక సహాయం అందించాలని,ప్రతి కుటుంబానికి ఒక శాశ్వత ఉద్యోగం కల్పించాలని, వేట సాగించే తెప్పలు, అలివికి రూ.5 లక్షల చొప్పున, బోటుకు రూ.10 లక్షలు పరిహారంగా అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.10 లక్షల విలువైన హెల్త్ కార్డు ఇవ్వాలని, మత్స్యకార గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కోరారు. మందుల పరిశ్రమల వ్యర్థాలు, సీపోర్టు వల్ల తమ ఉపాధి అవకాశాలు దారుణంగా దెబ్బతింటున్నందున తమ డిమాండ్లను తక్షణం నెరవేర్చాలని కోరారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పేకేటి హరికృష్ణ నిరసనకారులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. సూరాడ రాంబబాబు, ముత్తి మహేష్, కోడా అప్పలరాజు, చొక్కా బుల్లబ్బాయి, మహంకాళి, సత్యన్నారాయణ, జగన్నాధం పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 15: కాకినాడలో ఈనెల 14-15న నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఏపీఎస్పీకి చెందిన మోహన్ హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. స్థానిక సాలిపేట నగర పాలక సంస్థ హైస్కూల్లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్- 2023 సైన్స్ ప్రదర్శనలో మోహన్ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి సలాది ప్రజ్వల్ ప్రదర్శించిన నీటి పారుదల కొరకు పురుగు మందులతో ఆటోమేటిక్ నీటి ప్రవాహం ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు విద్యాశాఖాధికారులు ఎంపిక చేశారు. ప్రాజెక్టు రూపకల్పన చేసిన ఉపాధ్యాయురాలు ఈ కవిత, ప్రతిభ చూపిన విద్యార్థి సలాది ప్రజ్వల్‌ని విద్యాశాఖ ఆర్జేడి జీ.నాగమణి అభినందించారు. అలాగే వారిని పాఠశాల కరస్పాండెంట్ ఎం.మోహన్‌రావు, డైరెక్టర్ ఎం.వెంకటేష్, హెచ్‌ఎం నాగ దివ్యశ్రీ, ఉపాధ్యాయులు అభినందించారు.

కొత్తపల్లి: కాకినాడలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉప్పాడ కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మైలపల్లి చంద్రశేఖర్ ఎస్ఎంఎస్ ఆధారంగా ఎక్వేరియంలో ఉన్న చేపలకు ఆహారం అందజేసే పరికర ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ప్రాజెక్టు తయారు చేసేందుకు గైడ్‌గా వ్యవహరించిన దాకే అప్పలరాజు, చంద్రశేఖర్‌ను ప్రధానోపాధ్యాయుడు రమణమూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

తుని రూరల్: కాకినాడలో జరిగిన ఇన్‌స్పైర్ మానక్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో తుని గర్ల్స్ హైస్కూల్ నుంచి జి.శివనందినికి చెందిన ప్రాజెక్టు ది పవర్ జనరేషన్ వింగ్ రూఫ్ టాప్ సైన్ వెయిట్‌ను ప్రదర్శించగా రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమెను ప్రధానోపాధ్యాయులు ఎం.నూకరత్నం, కిశోర్, ఉపాధ్యాయులు అభినందించారు.

ముగిసిన రోడ్డు భద్రతా మాసోత్సవాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 15: రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. కాకినాడ డిపో మేనేజర్ ఎంయువి మనోహర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, ప్రాంతీయ రవాణా అధికారి పివిసాయి ప్రసాద్, కాకినాడ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.చైతన్యకృష్ణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. జిల్లా పరిధిలో ముగ్గురు డ్రైవర్లకు, డిపో పరిధిలో తొమ్మిది మంది ప్రమాదరహిత డ్రైవర్లకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ హరినాధరెడ్డి, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ షణ్ముఖశ్రీనివాస్, తుని, ఏలేశ్వరం డిపో మేనేజర్లు ఎన్.కిరణ్‌కుమార్, జి.సత్యనారాయణ, ఆర్ఎం ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్‌కెఎం భాషా, కాకినాడ, తుని అసిస్టెంట్ మేనేజర్లు టి.బాలకృష్ణ ఉన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

తల్లి, బిడ్డ క్షేమం



మహిళకు డెలివరీ చేసి బిడ్డతో టెక్నీషియన్

పిఠాపురం, ఫిబ్రవరి 15: నొప్పులు వస్తున్నాయని అంబులెన్స్‌లో ఆసుపత్రి వస్తున్న మహిళకు దారిలో నే డెలివరి అయింది. అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన కోరకుప్ప అచ్యుత చక్రం(22) నెలలు నిండి నొప్పులు వస్తుండడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. గొల్లప్రోలులో అందుబాటులో లేకపోవడంతో పిఠాపురం నుంచి 108 అంబులెన్స్ వెళ్లింది. వారు అక్కడ మహిళను ఎక్కించుకుని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి బయలుదేరారు. మార్గం మధ్యలోనే నొప్పులు అధికమయ్యాయి. దీంతో అంబులెన్స్ ఎమర్జన్సీ టెక్నీషియన్ పబ్బినీడి వరప్రసాద్, పైలట్ కృష్ణంరాజులు అత్యవసరంగా డెలివరీ చేశారు. బిడ్డ ఎదురుకాళ్లతో ఉండడంతో డెలివరీ కష్టతరమయినప్పటికి సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో తల్లి, ఆమెకు పుట్టిన మగ బిడ్డ క్షేమంగా ఉన్నారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అత్యవసర సమయంలో డెలీవరీ చేసిన సిబ్బందిని పలువురు అభినందించారు.

'నేడు దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలి'

సర్పవరం జంక్షన్/కొత్తపల్లి, ఫిబ్రవరి 15: ట్రాన్స్‌పోర్టు, లైసెన్స్ డ్రైవర్ల పాలిట ఉరితాడులో మారిన కేంద్రం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో శుక్రవారం నిర్వహించనున్న దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని జయహో రథసారథి డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యేలేటిఏలేటి వాసు తిమ్మాపురంలో కోరారు. బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం మూలపేటలో ర్యాలీ చేశారు. అధ్యక్షులు కుంచే అంజిబాబు, వల్లూరి రాజబాబు, చిందాడ అర్జునరావు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం, ఫిబ్రవరి 15: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎన్‌డీఎస్ ప్రభాకర్ తెలిపారు. పిఠాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని దత్తాత్రేయ ఫీడర్‌పై గల ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఉప్పాడ సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్, పుల్లయ్యకాలువ వీధి, షిష్టికరణాల వీధి, వెంకటేశ్వర థియేటర్ బ్యాక్‌సైడ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు, ఫిబ్రవరి 15: గొల్లప్రోలు, చేబ్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో గల ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్‌లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం గొల్లప్రోలు పట్టణంతో పాటు సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కరెంటు సరఫరా ఉండదని చెప్పారు.

సామర్లకోటలో రేపు...

సామర్లకోట, ఫిబ్రవరి 15: సామర్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కెవీఏ విద్యుత్ ఫీడర్ల వార్షిక మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీర్ ఏవీఎన్డీఎస్.ప్రభాకర్ తెలిపారు. సామర్లకోటతో పాటు మండలంలోని నవర, పవర, గొంచాల, ఉండూరులో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

నేడు రథసప్తమి వేడుకలు

పెద్దాపురం, ఫిబ్రవరి 15: రాజమహేంద్రవవరం వెళ్లే ప్రధాన రహదారిలో స్థానిక పాండవుల మెట్ట (అమరగిరి)పై ఉన్న పంచాయతన నవగ్రహ సహిత పద్మినీ ఛాయా ఉషా ప్రజ్ఞాదేవి సమేత సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం16న రథసప్తమి వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు ఏర్పాట్లు చేశారు.

19 నుంచి కల్యాణోత్సవాలు

సామర్లకోట, ఫిబ్రవరి 15: మండలంలోని వేట్లపాలెం గ్రామ గోదావరి కాలువ ఒడ్డున వేంచేసి ఉన్న వేంకటేశ్వర స్వామి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 24 వరకూ వైభవంగా జరుపనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు గురువారం వెల్లడించారు.

చంద్రబాబును కలిసిన దివ్య



తుని రూరల్, ఫిబ్రవరి 15: తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య టీడీపీ మంగళగిరి కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబును మర్యాదపూర్వకంగాకలిశారు. దివ్య తండ్రి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడుతో కలిసి నియోజకవర్గ సమస్యలు, పరిస్థితులపై చర్చించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు చంద్రబాబుకు వివరించినట్టు దివ్య చెప్పారు.

అయోధ్యకు ఆర్టీసీ బస్సు

కోటనందూరు, ఫిబ్రవరి 15: కోటనందూరు నుంచి అయోధ్యకు ఆర్టీసీ బస్సు బయలుదేరింది. తుని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 10 రోజులయాత్రకు బయలు దేరగా జిల్లా ప్రజారవాణాధికారి ఎమ్.శ్రీనివాస్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు అయోధ్యతో పాటు కాశీ తదితర యాత్రలు చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో మేనేజరు ఎన్‌కిరణ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ జివిరమణ తదితరులున్నారు.

వైఎస్సార్ విగ్రహానికి నివాళి

జగ్గంపేట, ఫిబ్రవరి 15: జగ్గంపేట సెంటర్లో దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి కాకినాడ పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి చలమల శెట్టి సునీల్ పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ముత్యాల శ్రీనివాస్, ఎంపీటీసీలు గొల్లపల్లి శ్రీను, ఆకుల శ్రీధర్, చెరుకూరి జయరాజు, మండల సేవా దళ్ కన్వీనర్ కీలపర్తి వీరబాబు, కాపవరపు ప్రసాద్ పాల్గొన్నారు.

పోల్నాటి పరామర్శ

తుని రూరల్, ఫిబ్రవరి 15: టీడీపీ సీనియర్ నేత పోల్నాటి శేషగిరిరావు తుని మండలంలో పలువురిని పరామర్శించారు. ఇటీవల ప్రమాదంలో గాయాలపాలైన వెంకటపురానికి చెందిన గోవిందు, శ్రీనును పరామర్శించారు. టీడీపీ మండలాధ్యక్షుడు అప్పన రమేష్, టీడీపీ నాయకులున్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

రౌతులపూడి, ఫిబ్రవరి 15: బలరామపురం గ్రామంలో పాదాలమ్మ, మరిడమ్మ ఆలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. వారం రోజులుగా భజనలు నిర్వహించారు. శుక్రవారం అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. రౌతులపూడిలో శివాలయం ఆవరణలో సూర్యనారాయణమూర్తి, అయ్యప్ప విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు.

తునిలో సినిమా షూటింగ్



షూటింగ్‌లో అల్లరి నరేష్

తుని రూరల్, ఫిబ్రవరి 15: తునికి చెందిన దర్శకుడు సుబ్బు దర్శకత్వం వహిస్తున్న బచ్చల మల్లి చిత్ర షూటింగ్ తునిలో జరిగింది. నటుడు అల్లరి నరేష్, ఇతర తారాగణంపై తుని తహశీల్దార్ కార్యాలయం వెనుక గల పురాతన భవనంలో పలు సన్నివేశాలు చిత్రీకరించారు. 12 రోజుల పాటు తుని, పాయకరావుపేట పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరగనున్నట్టు తెలిపారు.